"నువ్వు ఎంత అల్పుడివో తెలుసుకో రాజా. నీ యావత్తు పరాక్రమం, సంపద, శక్తియుక్తులు నదిలో పడ్డ చిన్న సూది ముందు పని చేయలేదు."

దాంతో రాజుకున్న గర్వం అణిగిపోయింది. అతను ఆయన్ని గురువుగా స్వీకరించి, ఆయన దగ్గర మంత్రోపదేశం పొంది త్వరలోనే మిగిలిన అహాన్ని కూడా వదిలించుకో గలిగాడు.

## 5. కప్పెక్కిన గుఱ్ఱం

ఓ సంచార గురువు బోధనలు విన్నాక ఓ రాజుకి ఆత్మ సాక్షాత్కారం మీద ఆసక్తి కలిగింది. అతను బంగారు శివుడి విగ్రహం చేయించి, తన అంతఃపురంలో వుంచి నిత్యం దానికి పంచామృతంతో అభిషేకం చేయసాగాడు. అయితే ఇంతకుమించి ఆ రాజు జీవన స్థాయిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు.

ఓ రాత్రి రాజు పుష్పాలతో అలంకరించిన శయ్యమీద పడుకోబోతూ, కిందనించి ఎవరో పిలిచినట్లు అనిపించి కిటికీ దగ్గరకి వెళ్ళి కిందికి చూసాడు. వీధిలో వున్న ఒకతను రాజుని గట్టిగా అడిగాడు.

"రాజా! నా గుఱ్ఱం తప్పిపోయింది. అదికానీ మీ పడకగది కప్పు మీద వుందేమో చూసి చెప్తారా?"

"నీకేమైనా పిచ్చా? గుఱ్ఱం నా పడకగది కప్పు ఎలా ఎక్కగలదు?" అడిగాడు రాజు కోపంగా.

"మీరు పూలపాన్పు మీద నిద్రిన్నూ, ఆత్మసాక్షాత్కారం పొందాలనుకుంటున్న రీతిలోనే." జవాబు చెప్పాడతను.

ఆ సమాధానంతో అబ్బురపడ్డ రాజు తేరిపార చూసి, అతను సంచార గురువని గుర్తించి వెళ్ళి ఆయన్ని సాదరంగా ఆహ్వానించాడు. ఆయన బోధనలతో రాజు త్వరలోనే వైరాగ్యాన్ని అలవరచుకుని ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించాడు.